క్లుప్తంగా

మహిళలు, బాలల రక్షణకు ప్రత్యేక చట్టాలు

తాళ్లరేవు: మహిళలు, బాలల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని, హింసకు గురైనప్పుడు బాధితులు చట్టాన్ని ఆశ్రయించి న్యాయం పొందాలని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవులోని భీమాబాయి మహిళా మండలి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహిళలు, బాలలపై హింసలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన సమావేశానికి అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పి.కనకరత్నం, సీహెచ్ నాగలక్ష్మి ఐసీడీఎస్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. మహిళా మండలి సిబ్బంది, పలు మండలాలకు చెందిన గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ నిధులు ఖర్చు చేయాలి

యానాం: వ్యవసాయశాఖకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు త్వరతగతిన గడువు విధించిన సమయంలోనే ఖర్చు చేయాలని శుక్రవారం వ్యవసాయశాఖ కార్యదర్శి మహ్మద్ యాసిన్ ఆదేశించారు. వ్యవసాయశాఖ ద్వారా చేపడుతున్న వివిధ ప్రాజెక్టులపై అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఖర్చు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేడీ సుందరరాజన్, జయశంకర్, శిశషణ్ముగం, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గొల్లవిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు నియమితులైన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రుకు చెందిన జనసేన నాయకుడు మంచెం బాలకృష్ణ అధ్యక్షుడిగా, తోకల సుబ్బారావు, పాటి సత్యనారాయణ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసి భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గతో పాటు పలువురు వారిని అభినందించి, సత్కరించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.37,07,207 ఆర్థిక సహాయ చెక్కులను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మురమళ్లలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాల రీత్యా చికిత్స చేయించుకున్న ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు సంబంధించిన 43 మంది లబ్ధిదారులకు మంజూరైన సొమ్మును చెక్‌ల ద్వారా అందజేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, నడింపల్లి సుబ్బరాజు, పోద్దోకు బాలు, కొత్తూరు కోసేస్వరుడు, గోల కోటి దొరబాబు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఓగూరి భాగ్యశ్రీ

ముమ్మిడివరం: మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కాట్రేనికోన మండలానికి చెందిన ఓగూరి భాగ్యశ్రీ నియమితులయ్యారు. ఓగూరి భాగ్యశ్రీ మాజీ మంత్రి మోకా విష్ణుప్రసాద రావు కుమార్తె. ముమ్మిడివరం మార్కెట్ కమిటీ జనసేనకు కేటాయించడంతో భాగ్యశ్రీకి ఈ పదవి కేటాయించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని గురజనాపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొల్లంగి గ్రామానికి చెందిన పులపకూర మరియమ్మ(49) మృతి చెందినట్టు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ చొల్లంగిలోని తన ఇంటి వద్ద నుంచి చొల్లంగిపేట గురుకుల పాఠశాలకు వెళ్లేందుకు మరియమ్మ గురజనాపల్లి జంక్షన్ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో రోడ్డు దాటుతుండగా యానాం నుంచి కాకినాడ వైపునకు వేగంగా వెళుతున్న బైక్ ఢీకొనడంతో మరియమ్మ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీచర్ల బదిలీల పాలసీ విడుదల

యానాం: ప్రభుత్వ పాఠశాలల టీచర్ల బదిలీల పాలసీని శుక్రవారం స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ఎఫ్‌బీ వెర్బినాజయరాజ్ విడుదల చేశారు. బదిలీలను వివిధ కేటగిరీలుగా విభజించినట్లు ఆయన తెలిపారు.

శ్రీదుర్గకు ఘన సత్కారం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీదుర్గను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. దేవరపల్లి వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగబాబు,పందు సత్యనారాయణ మూర్తి, దోనిపాటి అంబేద్కర్ పాల్గొన్నారు.

నాణ్యత డొల్ల.. రోడ్డు గుల్ల


పల్లంకుర్రులో పంట కాలువ ఆధునీకరణ పనుల కోసం బలుసుతిప్ప వెళ్లే రోడ్డును తవ్వేయడంతో సత్తమ్మ చెట్టు లాకు-2 వద్ద విరిగిపడిన బీటీ రోడ్డు

- ఇష్టారాజ్యంగా ఆధునీకరణ పనులు
- పంట కాలువ వైపు విరిగిపడిన బలుసుతిప్ప రోడ్డు
- వాహనాల రాకపోకలకు బ్రేక్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కాట్రేనికోన: బొబ్బర్లంక- పల్లంకుర్రు బ్యాంకు కెనాల్‌పై సత్తమ్మ చెట్టు లాకు- 2 వద్ద ఇరిగేషన్ శాఖ చేపట్టిన రెగ్యులేటర్, రిటర్నింగ్ వాల్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో పంట కాలువ వైపు రోడ్డు జారిపోయింది. గోదావరి సెంట్రల్ డెల్టా ఆధునీకరణ పనుల్లో భాగంగా బొబ్బర్లంక నుంచి పల్లంకుర్రు వెళ్లే బ్యాంకు కెనాల్‌పై అయినాపురం, పల్లంకుర్రు -2 లాకు వద్ద సుమారు రూ.కోటి వ్యయంతో అధికారులు ఆధునీకరణ పనులు చేపట్టారు.ఎస్.సావరం వెళ్లే పంట కాలువకు అయినాపురం వద్ద రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్, కుండలేశ్వరం వెళ్లే కాలువకు రెగ్యులేటర్, ఎస్.కొత్తపల్లి పంట కాలువకు మూడు బాక్స్‌ల కల్వర్టులు, పల్లంకుర్రు లాకు -2 వద్ద రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్ పనులు చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో పనులు నాణ్యత లోపించింది. గురువారం రాత్రి రోడ్డు పూర్తిగా విరిగి కాలువ వైపు జారిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బస్సులు, కార్లు, ట్రాక్టరులు, లారీలు, ఆటోలను లైన్‌పేట రోడ్డుకు ట్రాఫిక్ మళ్లించినా మోటారు వాహనాలపై వెళ్లేవారు రోడ్డు విరిగిపడిన చోట చిన్నపాటి వర్షాలకు పంట కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది.

పంట కాలువ వైపు జారిపోయిన రోడ్డు

పల్లంకుర్రు లాకు-2 సత్తమ్మ మర్రి వద్ద ఆధునీకరణ పనుల కోసం రోడ్డును తవ్వి పంట కాలువలోని మట్టితో గోతులను పూడ్చారు. లాకు వద్ద రోడ్డు కంటే ఎత్తు వరకు కాంక్రీట్ వాల్ నిర్మించకపోవడంతో కాలువ గట్టు కుంగిపోయి రోడ్డు జారిపోయింది. ఈ ప్రాంతంలో పంట కాలువకు కాంక్రీట్ వాల్ నిర్మించాలని రైతులు కోరినా ఎవరూ పట్టించు కోలేదు. కాంక్రీట్ వాల్ అవసరమైన చోట నిర్మించకపోవడం, ఆధునీకరణ పనుల కోసం రోడ్డును తవ్వగా ఏర్పడిన గోతులను పంట కాలువలో తీసిన జిగురు మట్టితో పూడ్చడంతో నష్టం వాటిల్లింది. కాంక్రీట్ వాల్ నిర్మాణం, గోతుల ఫిల్లింగ్ పనులు చేస్తున్నపుడు ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత కొరవడింది.


పల్లంకుర్రులో తవ్వేసిన బీటీ రోడ్డుకు పంట కాలువ, కాంక్రీట్ వాల్‌కు మధ్య బంక మట్టితో పూడ్చివేత

రోడ్డు జారిపోవడంతో రాకపోకలకు బ్రేక్

రోడ్డు పంటకాలువ వైపు జారిపోవడంతో వాహనాల రాకపోకలకు బ్రేక్ పడింది. పల్లంకుర్రు-బలుసుతిప్ప వెళ్లే రోడ్డు మీదుగా సాపేవారి పేట, బూలవారి పేట, వడ్డిపేట, రామాలయం పేట, ఐ.చెరువు, గొల్లగరువు, కొత్త ఆదియాంధ్ర పేట, మచ్చవారిపేట, మొక్కల తిప్ప, మొక్కల తిప్ప అంబేడ్కర్ నగర్ వంటి ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రయాణిస్తూ జిల్లా కేంద్రాలకు వెళతారు. ప్రతి రోజు బలుసుతిప్ప ఆర్టీసీ బస్సులో మహిళలు, వృద్ధులు, 108, 104 వంటి అత్యవసర సర్వీసులతో పాటు ప్రైవేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన బస్సుల్లో విద్యార్థులు ప్రయాణిస్తారు. ఈ ప్రాంతంలో వ్యవసాయంతో పాటు రొయ్యలు, చేపలు సాగు, కొబ్బరి దిగుబడులు అధికంగా ఉంటాయి. చేపలు, రొయ్యల చెరువులకు మేతలు, పట్టుబడులు సమయంలో చేపలు, రొయ్యలు, వరి కోతల సమయంలో ధాన్యం ఎగుమతులు, కొబ్బరి లోడుతో అధిక బరువులతో వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది.

ఆధునీకరణ పనుల పేరుతో రోడ్డు ధ్వంసం

పంట కాలువ ఆధునీకరణ పనుల పేరుతో గత ప్రభుత్వంలో వేసిన రోడ్డును నాశనం చేసారని రైతులు ఆరోపిస్తున్నారు. పల్లంకుర్రు-బలుసుతిప్పకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ప్రత్యేక మరమ్మతుల్లో భాగంగా 2021-22లో 0.000 కి.మీ.-2.900 కి.మీ అభివృద్ధి పనులు రూ.81.10 లక్షలు, 2023-24లో ఇంప్రూవ్‌మెంట్ సర్ఫేస్ రైడింగ్‌లో భాగంగా 2.900కి.మీ. 6.920 కిలోమీటర్లకు రూ.1.50 కోట్ల నిధులతో బీటీ రోడ్డు పనులు చేట్టారు. పంటకాలువపై ఇరిగేషన్ అధికారులు చేపట్టిన రిటర్నింగ్ వాల్, రెగ్యులేటర్ పనుల కోసం పొక్లయిన్‌తో బలుసుతిప్పకు వెళ్లే బీటీ రోడ్డును కొంత మేరకు తవ్వేసారు. జనిపెల్లి వారి పేట నుంచి పల్లంకుర్రు లాక్- 2 వరకు సుమారు కిలోమీటర్ పైబడి బీటీ రోడ్డుపై బరువు వాహనాల రాకపోకలతో దిగబడుతోంది. కాంక్రీట్ వాల్ నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వేయడంతో అధ్వానంగా తయారైంది.

అధికారుల అలసత్వం కారణంగానే నష్టం



ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారుల అలసత్వంతోనే పల్లంకుర్రు -బలుసుతిప్ప వెళ్లే రోడ్డును ఆధునీకరణ పనుల పేరుతో తవ్వేసి, పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్డు విరిగిపడింది. శివారు ప్రాంత ప్రజలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సత్తమ్మ చెట్టు లాకు- 2 వద్ద రోడ్డు విరిగి పడిన ప్రాంతంలో తక్షణమే కాంక్రీట్ వాల్ నిర్మించాలి. తవ్వేసిన రోడ్డుకు, కాంక్రీట్ వాల్‌కు మధ్యలో వేసిన జిగురు మట్టి తొలగించి పటిష్టంగా బీటీ రోడ్డు పనులు చేపట్టాలి.

– కన్నీడి వెంకటరమణ, అడ్వకేట్, పల్లంకుర్రు


పల్లంకుర్రులో రోడ్డును తవ్వి పంట కాలువ వైపు గోతిలో మట్టి వేయడంతో దిగబడుతున్న వైనం (ఫైల్)

ఆటో స్టాండ్లకు స్థలాల సేకరణ

అమలాపురం టౌన్: పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన క్రమంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఆటో కార్మికుల యూనియన్ ప్రతినిధులకు సూచించారు. అమలాపురంలో ఆటో స్టాండ్లకు అవసరమైన స్థలాలను మున్సిపాలిటీ త్వరలోనే సేకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని ఆటో కార్మికులు, యూనియన్ ప్రతినిధులతో తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. యూనియన్ పరంగా ఉన్న ప్రధాన సమస్యలైన ఆటో స్టాండ్‌లకు స్థలాల సేకరణపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, ఆటో కార్మికుల ఇబ్బందులపై కమిషనర్ చర్చించారు. ఆటో స్టాండ్‌లకు, ఆటో యూనియన్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు కమిషనర్‌ను అభ్యర్థించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు కమిషనర్‌కు అందించారు. ఇటీవల కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నిర్మల్‌కుమార్‌కు యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. జిల్లా యూనియన్ కార్యదర్శి ఊటాల వెంకటేష్, డివిజన్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి శంకర్, బొక్కా నాని, అమలాపురం పట్టణ యూనియన్ ప్రతినిధులు బొమ్మి ఫణీంద్ర, రాయుడు ప్రసాద్, కాశి కరుణాకర్, దొమ్మేటి రామకృష్ణ, మట్టపర్తి నారాయణ పాల్గొన్నారు.


ఆటో యూనియన్ కార్మిక నాయకులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించిన ఎంపీ హరీష్ మాథూర్

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 యానాం బైపాస్, సుంకరపాలెం జంక్షన్‌లో ఎన్‌హెచ్ అధికారుల నిర్వాకం కారణంగా ఏర్పడిన డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సాయిశ్రీనివాస్, యానాం మున్సిపల్ కమిషనర్ అఖిల్‌తో కలసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు, స్థానిక బైపాస్ శ్రీ లక్ష్మీవరసిద్ధి వినాయక వర్తక సంఘం అధ్యక్షుడు పుగాకు వాసు, అడబాల శివ, మాణిక్యం, సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు ఐదేళ్లుగా డ్రెయినేజీ సమస్య కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఎన్‌హెచ్ నిర్మించిన డ్రెయినేజీ కేవలం వర్షం నీరు పోవడానికి మాత్రమేనని, సమీప వ్యాపార దుకాణాలు, గృహాల మురుగునీరు డ్రెయినేజీలో కలపడం వల్ల ఈ సమస్య తలెత్తిందని ఎన్‌హెచ్ పీడీ సాయి శ్రీనివాస్ వివరించారు. ప్రస్తుతం ఉన్న డ్రెయినేజీకి సమాంతరంగా మరో డ్రెయినేజీని నిర్మించాలని సూచించారు. ఆ మేరకు చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపూరి వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కర్రాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు.


సుంకరపాలెం జంక్షన్‌లో మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్ మాథూర్, ఎమ్మెల్యే దాట్ల

అమలాపురం డీసీటీవోగా భక్త వత్సలం


డీసీటీవో భక్త వత్సలాన్ని అభినందిస్తున్న పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం వాణిజ్య పన్నుల కార్యాలయం (సీటీవో) డీసీటీవోగా ఇళ్ల భక్త వత్సలం నియమితులయ్యారు. ఈయన అంబాజీపేట సీటీవో కార్యాలయంలో డీసీటీవోగా పని చేస్తూ బదిలీపై అమలాపురం బదిలీ అయ్యారు. డీసీటీవో భక్త వత్సలాన్ని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్, బంగారు, వెండి వర్తకుల (బులియన్) అసోసియేషన్‌కు చెందిన వ్యాపార ప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు రాయుడు నాని, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, చింతలపూడి సత్తిబాబు, మానే ప్రకాష్, చవ్వాకుల కృష్ణ, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు కొత్త డీసీటీవోను కలిసిన వారిలో ఉన్నారు. వ్యాపారులు వాణిజ్య పన్నులు సకాలంలో చెల్లించి తమ డిపార్ట్‌మెంట్‌కు సహకరించాలని డీసీటీవో భక్త వత్సలం కోరారు.

విద్యార్థులు భవిష్యత్తు కోసం అడుగులు వేయండి

అమలాపురం రూరల్: జీవితాన్ని సర్వ నాశనం చేసే డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు అడుగులు వేయాలని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం వీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై శేఖర్ బాబు, బీవీసీ ప్రిన్సిపాల్, డాక్టర్ జీవీఎంవీ రామారావు ఏవో జక్కం కృష్ణారావు పీడీ రవి సుదీర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ దుర్గారావు పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకరణలో అమ్మవార్లు

అమలాపురం టౌన్: పట్టణంలోని నల్లా వీధి, సావరం ప్రాంతాల్లోని అమ్మ వార్ల ఆలయాలు ఆషాఢ మాస శోభను సంతరించుకున్నాయి. నల్లా వీధిలోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నల్లా వీధికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.సావరం బైపాస్ రోడ్డులో కనకదుర్గ ఆలయంలో ఆషాఢ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. సావరానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ తదితరులు అమ్మవారికి పూజలు చేశారు.

పట్టణంలోని గాంధీనగర్‌లో కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని శాకంబరీదేవిగా శుక్రవారం అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ తిక్కిరెడ్డి ఆదినారాయణ, పూజారి రామేశ్వరపు రాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.


అమలాపురం నల్లా వీధిలో విజయదుర్గ


సావరం బైపాస్ రోడ్డులో కనకదుర్గమ్మ

వైభవంగా పట్టణ దేవత సుబ్బాలమ్మ జాతర

అమలాపురం టౌన్: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ జాతర మహోత్సవం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో వీధుల్లో పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో నిర్వహించిన భారీ ఊరేగింపు ప్రజలను ఆకట్టుకుంది. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, పట్టణ సంఘం అధ్యక్షుడు కళ్లపల్లి గోవింద్ మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాసంలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుబ్బాలమ్మకు 29 ఏళ్లుగా జాతర నిర్వహిస్తున్నామన్నారు. ఊరేగింపులో గరగ నృత్యాలు, శక్తి వేషాలు, తీన్‌మార్, కేరళ డప్పుల దరువు, విచిత్ర వేషాలు, కొమ్ము బూరలు, బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళంతో ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పసుపులేటి మురళి, కళ్లపల్లి తేజ, గనియాడ చిట్టిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. సుబ్బాలమ్మకు నాయీ బ్రాహ్మణ ప్రతినిధులు, సభ్యులు బెల్లం పానకం, చలిమిడి, వడ పప్పు తదితర కావిళ్లతో సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.


అమలాపురంలో సుబ్బాలమ్మ జాతరలో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, కళాకారులు

వయో పరిమితి నిబంధన సడలించాలి

అమలాపురం టౌన్: జవహర్ నవోదయ విశ్వ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు కొలమానమైన వయో పరిమితి నిబంధనలను సడలించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.అమృతరావు విన్నవించారు. నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు తొమ్మిదేళ్లు నిండిన వారికి మాత్రమే అర్హులవుతారని ప్రకటించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. జవహర్ నవోదయ విశ్వ విద్యాలయంలో ప్రవేశానికి ఒకటి నుంచి మూడు నెలల తక్కువ వయస్సు ఉంటే ఆ విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడంతో చాలా మంది తెలివైన విద్యార్థులు అవకాశం కోల్పోతున్నారని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ కుమార్, ప్రధాన కార్యదర్శి అమృతరావు విజ్ఞప్తి చేశారు.

సేవ్ ది పీపుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం


విద్యార్థి తల్లికి చెక్కు అందిస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం రూరల్: సేవ్ ది పీపుల్ ట్రస్ట్ సమాజ శ్రేయస్సును కోరి మానవతా దృక్పథంతో చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్వో చేతుల మీదుగా రూ.20 వేల చెక్కును విద్యార్థి తల్లికి అందజేశారు. ఏడవ తరగతి విద్యార్థి గెద్దాడ భరత్‌కుమార్, తొమ్మిదో తరగతి విద్యార్థి మానసకు సేవ్ ది పీపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేల చెక్కును వారి చదువు నిమిత్తం తల్లి గంగా భవానీకి అందించారు. సేవ్ ది పీపుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుంకర సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత సంస్థ సేవా ద్వారా దృక్పథంతో 20 వేల చెక్కు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మానస సుప్రియ, నవ్య, నాగదుర్గ, రాజు పాల్గొన్నారు.

అటల్ ల్యాబ్ శిక్షణకు జిల్లా సైన్స్ బృందం

అమలాపురం టౌన్: జిల్లా పరిధిలోని 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు (ఏటీఎల్) పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా పనిచేయడానికి జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 11 మంది రిసోర్స్ పర్సన్ల బృందం విజయవాడలోని సెయింట్ మేరీ స్టెల్లా కాలేజీలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక అటల్ ల్యాబ్ వర్క్‌షాపునకు వెళ్లింది. రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాసెసింగ్ డైరెక్టర్ ఆదేశాలతో డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా సూచనల మేరకు జిల్లా సైన్స్ బృందం ఆ వర్క్ షాపులో పాల్గొంది. ఈ శిక్షణ ద్వారా జిల్లా సైన్స్ బృందం విలువైన జ్ఞానాన్ని సాధించిందని జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ శిక్షణ జిల్లా విద్యా రంగ అభివృద్ధికి, విద్యార్థుల సాంకేతిక ప్రగతికి బలమైన పునాది వేస్తుందని డీఈవో బాషా అన్నారు.

20న కంప్యూటర్ బేస్డ్ పరీక్ష

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్ష అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల, అమలాపురం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాత పరీక్ష నిర్వహణకు సంబంధించి వివిధ శాఖలతో జేసీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కోనసీమ జిల్లాకు సంబంధించి 386 మంది రాత పరీక్షకు హాజరుకానున్నారని వీరిలో శ్రీనివాస కళాశాలలో 206 మంది, భట్లపాలెం ఇంజనీరింగ్ కళాశాలలో 180 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని తెలిపారు. రాత పరీక్ష ఈనెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. డిప్యూటీ తాహసీల్దార్ గోపాలకృష్ణ, తహసీల్దార్ సుబ్రహ్మణ్యేశ్వరరావు పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, డీఎంహెచ్‌వోఎం దుర్గారావు దొర ,మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

ఐ.పోలవరం: జి.మూలపాలం పంచాయతీ ఎర్ర గురువు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ మహిళ విభాగం ఆధ్వర్యంలో మావుళ్లమ్మకు ఆషాఢం సారె సమర్పించారు. గ్రామస్తులు, మహిళలు శుక్రవారం పసుపు, కుంకుమ, చీర రవిక, చలిమిడి పానకం, పండ్లు, పసుపు నీళ్ల బిందులతో శోభాయాత్రగా బయలుదేరి అమ్మవారికి పసుపు నీళ్లు సమర్పించారు. ఎదురులంక రామాలయం సెంటర్లో విజయదుర్గమ్మను శాకంబరిగా అలంకరించి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ కనకారావు, రెడ్డి నాగభూషణం, సీతామహాలక్ష్మి, మందపాటి లక్ష్మి, కడలి సతీష్, లిఖిత, గాలి విశాలక్ష్మి, గంగుల వరలక్ష్మి పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆషాఢం సారె

అమలాపురం రూరల్: ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో సమనస గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు సారెను సమర్పించారు. తొలుత మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జి.మూలపాలం పంచాయతీ ఎర్ర గురువులో మావుళ్లమ్మ ఆలయానికి సారెతో వెళుతున్న మహిళలు


సమనస గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు సమర్పించిన సారె